క్లుప్తంగా

కార్పొరేషన్‌కు ఐఏఎస్ కమిషనర్

- సోమవారం బాధ్యతల స్వీకారం


నూతన కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: కాకినాడ నగరపాలకసంస్థకు ఐఏఎస్ కమిషనర్‌ను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా 2016 బ్యాచ్‌కు చెందిన రావిరాల మహేష్‌కుమార్‌ను కాకినాడ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్నారు. గతంలో కొంతకాలం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్‌గా కూడా సేవలందించారు. కార్పొరేషన్‌లకు ఐఏఎస్ అధికారులను కమిషనర్లుగా నియమించే క్రమంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు. కార్పొరేషన్‌కు ఐఏఎస్ అధికారి స్వప్నిల్‌దినకర్‌పుండ్కర్ సుమారు రెండేళ్లపాటు సేవలు అందించారు. అంతకుముందు కూడా ప్రత్యేక అధికారి పాలనలో కూడా ఐఏఎస్‌లు పనిచేశారు. ప్రస్తుతం మళ్ళీ ఐఏఎస్ పాలన రానుంది.

సోమవారం బాధ్యతల స్వీకారం

కాకినాడ నగరపాలకసంస్థ నూతన కమిషనర్ రావిరాల మహేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందింది. సోమవారం ఉదయం ఆయన విధుల్లో చేరే అవకాశం ఉందని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు.

బాలికల విద్యను ప్రోత్సహించడం అభినందనీయం


విద్యార్థినులకు సర్టిఫికెట్లు, నగదు పంపిణీ చేస్తున్న ఎంపీ గీత

కాకినాడ రూరల్: బాలికల విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతిభాపురస్కార్ పేరిట స్కాలర్‌షిప్‌లను కోరమండల్ సంస్థ అందించడం అభినందనీయమని కాకినాడ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ పేర్కొన్నారు. వలసపాకలలోని కోరమాండల్ కర్మాగారంలోని కోరమండల్ నాలెడ్జ్ సెంటర్‌లో శుక్రవారం ప్రతిభాపురస్కార్ స్కాలర్‌షిప్ పురస్కారాన్ని ఆమె ప్రారంభించారు. 8,9,10 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన బాలికలకు మొదటి బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 3,500, పదవ తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియెట్ చదివేవారికి స్కాలర్‌షిప్‌లను అందజేశారు. కోరమాండల్ యూనిట్ హెడ్ సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో 130 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, నగదు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. కోరమండల్ జీఎం హెచ్‌ఆర్ పద్మనాభం, సంస్థ సీఎస్‌ఆర్ మేనేజర్ వంశీకృష్ణ, సీఎస్‌ఆర్ కో–ఆర్డినేటర్ ప్రియాంబిక పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కరప: మండలం సిరిపురంలో శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు నమోదు అయిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య సూచించారు. పేషెంట్‌ను హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్యులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందన్నారు. ఈ మధ్యకాలంలో ఎక్కువగా జ్వరం కేసులు వస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ ఏమాత్రం అనుమానంగా ఉన్నా వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని చెప్పారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత

బోట్‌క్లబ్: స్థానిక మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయం స్థలంలో శుక్రవారం అక్రమంగా నిర్మిస్తున్న గోడ నిర్మాణ పనులను ఈఓ తారకేశ్వరరావు నిలుపుదల చేశారు. ఆలయ సమీపంలో ఉన్న ఇళ్లకు చెందిన వారు ఆలయానికి చెందిన స్థలంలో గోడ నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా విషయం తెలుసుకున్న ఈఓ పనులు అడ్డుకున్నారు. దేవస్థానానికి చెందిన స్థలం నుంచి బయట వ్యక్తులకు దారి ఇవ్వడం కుదరని చెప్పారు. ఇక్కడ తమ అనుమతి లేకుండా ఎటువంటి పనులు చేసిన వారిపై చర్యలు తీసుకొంటామని చెప్పడంతో వారు వెనుతిరిగారు.

రేపు మాయ పుస్తక ఆవిష్కరణ

కాకినాడ కల్చరల్: స్థానిక రాజారామ్మోహన్‌రాయ్ వీధిలోని శాస్త్రీ కళాప్రాంగణంలో సాహితీ స్రవంతి నగరశాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు రచించిన మాయ (కథాసంపుటి) పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్టు నగరశాఖ అధ్యక్షుడు మార్ని జానకీరామ్‌చౌదరి తెలిపారు. సభకు గనారా అధ్యక్షత వహిస్తారని తెలిపారు. అనంతరం నచ్చిన అంశంపై కవి సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు.

టీడీపీ ప్రచారం

కరప: మండలంలోని అరట్లకట్టలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించి, కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ సర్పంచ్ కంటే సత్తిబాబు పాల్గొన్నారు.


వలసపాకలలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు


ఇంటికి స్టిక్కరు అతికిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో కౌడ చైర్‌పర్సన్ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న తదితరులు

జగనన్నే మా భవిష్యత్తు

- వలసపాకలలో కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నబాబు
- ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం చేసిన పనులు వివరించిన నేతలు

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రగతిని వివరించడంతో పాటు గతంలో చంద్రబాబు ప్రభుత్వ పనితీరుకు, జగనన్న ప్రభుత్వ పనితీరుకు మధ్య వ్యత్యాసం ప్రజలకు వివరించే లక్ష్యంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం కాకినాడ రూరల్ మండలంలో అట్టహాసంగా ప్రారంభమైంది. వలసపాకల గ్రామ సచివాలయం – 2 పరిధిలో సాయిబాబా ఆలయం నుంచి కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే కన్నబాబు లాంఛనంగా ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ కన్నబాబు పర్యటించారు. మహిళలకు ప్రభుత్వ పనితీరును స్వయంగా వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఏ విధంగా మోసం చేసిందో తెలియజేశారు. ముఖ్యమంత్రి పాలనపై రూపొందించిన ప్రశ్నావళికి మహిళల నుంచి సమాధానాలు రాబట్టారు. ఇంటి డోర్లకు, సెల్‌ఫోన్లకు స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ అన్ని సచివాలయాల పరిధిలో 14రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. చంద్రబాబు గతంలో ప్రజలను హామీల పేరిట వంచించారన్నారు. చెప్పాడంటే చేస్తాడు అన్నట్టు మా నాయకుడు జగన్ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. మా ప్రభుత్వ పరిపాలనతో జరిగిన మేలును తెలియజేస్తున్నామన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న పుస్తకం ద్వారా ఐదు ప్రశ్నలతో అందరి అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. జగన్ పట్ల ప్రేమగాని, తిగిరి మద్దతు ఇస్తారా, డీబీటీ ద్వారా పథకాల లబ్ధి తదితర ప్రశ్నలు ఉంటాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరుకుంటున్నారా లేదా అని వివరాలు సేకరిస్తున్నామన్నారు. ప్రజల ఇంటి వద్ద వారి అనుమతితో స్టిక్కర్లు వేస్తున్నామన్నారు. రాష్ట్రంలో సుమారు రూ.2లక్షల కోట్లు పైబడి ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిని అందిస్తే ప్రతిపక్షాలు ప్రజలకు డబ్బులు ఇవ్వడమే తప్పు అన్నట్టుగా చిత్రీకరిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, కరప జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ళ సుబ్బారావు, మండల సచివాలయాల కన్వీనరు గీసాల శ్రీను, గోపిశెట్టి బాబ్జీ, గుత్తుల కృష్ణంరాజు పాల్గొన్నారు. అనంతరం రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పోస్టరును ఆవిష్కరించారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్క హామీని అమలు చేస్తున్న సీఎం

- ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ప్రజలకు ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని అమలు చేయడం ద్వారా దేశ చరిత్రలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందడం ద్వారా ప్రజల హృదయాల్లో సీఎం ×జగనన్నే మా భవిష్యత్తు¥ అనిపించుకునేలా పాలన సాగిస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు శుక్రవారం స్థానిక 30వ డివిజన్ లక్ష్మీగణపతి ఆలయం నుంచి కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తికుమార్, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తుకు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఆలయంలో ఎమ్మెల్యే ద్వారంపూడి, నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ సుమారు నాలుగేళ్ల సీఎం జగన్ పాలనలో చేసిన అభివృద్ధిని వివరించడంతోపాటు, గత ప్రభుత్వం ప్రజలను ఎలా మోసం చేసిందో అర్థమయ్యేలా ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రజలకు పార్టీని మరింత చేరువ చేసేందుకే ఈ కార్యక్రమాన్ని పార్టీ ఏర్పాటు చేసిందన్నారు. కాకినాడ సిటీలోని అన్ని సచివాలయాల పరిధిలో దాదాపు 4,500 మంది గృహసారథులు, 260 మంది కన్వీనర్లు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా సక్సెస్ చేయాలని, ప్రతీ ఇంటికి వెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజకీయాల్లో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు. కాకినాడలో దాదాపు 96వేల గృహాలు ఉండగా, 86వేల గృహాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. వీరందరినీ కలిసి టీడీపీ, వైఎస్సార్ సీపీ పాలనలో వ్యత్యాసాలను వివరించడమే కాకుండా పార్టీ సూచన మేరకు ఐదు ప్రశ్నలతో ప్రజాభిప్రాయాన్ని సేకరించి పంపిస్తామన్నారు. సోమవారం నుంచి రోజుకి నాలుగు డివిజన్ల చొప్పున పూర్తి చేస్తూ 20వ తేదీ నాటికల్లా నగరమంతా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చేసిన అభివృద్ధిని తెలియజెప్పి ప్రజల్లోకి ధైర్యంగా వెళ్ల గలుగుతున్నామన్నారు. ఈ సందర్భంగా స్థానిక పెంకే వారివీధిలో ఇంటింటికి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కొనసాగించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు, జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దుగ్గన బాబ్జి, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ఎస్.రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వాసుపల్లి కృష్ణ, కర్రి అనంతలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, లంకే హేమలత, సంగాని నందం, కామాడి సీత, చవ్వాకుల రాంబాబు, గోడి సత్యవతి, రోకళ్ళ సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్ర ఉత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్ర ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఆలయంలో నవరాత్ర ఉత్సవాలు వైభవంగా నిర్వహించిన వేద పండితులు, అర్చకులను ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి సత్కరించారు. కల్యాణోత్సవం వైభవంగా జరిగేందుకు కృషిచేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీపుష్పోత్సవం


సీతారామస్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీపుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ పరిసరాల్లో స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక ఊయల్లో స్వామివారికి వివిధ రకాల పువ్వులు, పండ్లు, స్వీట్లు ఉంచి ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

కాకినాడ సిటీ: అధికారుల నిరంతర తనిఖీలు విద్యావ్యవస్థకు లాభం కంటే నష్టమే ఎక్కువ చేకూరుస్తాయని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓలేటి వీవీ శాస్త్రి అన్నారు. కాకినాడలోని వ్యాస భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్‌వీ చలపతి అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలన్నారు. ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత మా ప్రభుత్వానిదే

- ఎమ్మెల్యే కన్నబాబు
- వాకలపూడిలో గడపగడపకూ..


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేసి సంక్షేమ పథకాలు అందించిన ఘనత మా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కుతుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం వాకలపూడి ఫిషింగ్‌హార్బర్‌పేటలోను, సాయంత్రం సచివాలయం–4 పరిధిలోని సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా మూడున్నరేళ్లలో పొందిన లబ్ధి వివరాలను తెలియజేశారు. సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడే ఉన్న అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. హార్బర్‌పేటలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, తాగునీటిని సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరారు. సంతోష్‌నగర్ ప్రాంతంలో డ్రైనేజీల నిర్మాణం, వీధిలైట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ధైర్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ళ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గోపిశెట్టి బాబ్జి, డీఎల్‌డీవో నారాయణమూర్తి పాల్గొన్నారు.

కాకినాడకే తలమానికం

- కౌడా యుద్ధ విమాన థీమ్ పార్కును పరిశీలించిన ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో సుమారు రూ.6కోట్ల వ్యయంతో సూర్యారావుపేట బీచ్‌లో యుద్ధ విమానాల మ్యూజియం, థీమ్ పార్కు పనులను శుక్రవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్, వీసీ సుబ్బారావుతో కలిసి పరిశీలించారు. యుద్ధ విమానాలతో పాటు పార్కు, తదితర వాటిని పరిశీలించిన తరువాత ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వీసీ సుబ్బారావు ల్యాప్‌ట్యాప్ ద్వారా కొన్ని ప్రతిపాదిత ప్రాజెక్టులను ఎమ్మెల్యేకు చూపించడంతో వాటిపై చైర్మన్‌తో కలిసి సమీక్షించారు. కాకినాడ బీచ్‌ను సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దేలా పనులు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మీడియాతో కన్నబాబు మాట్లాడుతూ రెండో సారి తాను శాసన సభ్యుడిగా అయిన తరువాత 2020లో ప్రతిష్ఠాత్మకంగా ఎయిర్ క్రాఫ్ట్ ప్రాజెక్టుగా గుడా నుంచి ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళామన్నారు. యుద్ధ విమానాలను ప్రదర్శనకు పార్కు ఏర్పాటును ఆయన ప్రోత్సహించారన్నారు. విశాఖపట్నం తరువాత కాకినాడలో ఇక్కడ ప్లాన్ చేశామన్నారు. తొలుత చిన్నపాటి ట్రైనీ యుద్ధ విమానం ఏర్పాటు చేశామన్నారు. తరువాత నావీలో సేవలందించిన టీయూ –142ఎం యుద్ధ విమానాన్ని తీసుకువచ్చామన్నారు. థీమా పార్కు ముఖ్య ఉద్దేశం త్రివిధ దళాలపై యువతలో ఆసక్తిని కలిగించడమన్నారు. ఇప్పటికే యాంపీ థియేటర్, చిల్డ్రన్ పార్కు పూర్తయ్యాయన్నారు. వీసీ సుబ్బారావు మాట్లాడుతూ మూడు నెలల్లో మ్యూజియం అందుబాటులోకి వస్తుందన్నారు. కౌడా సెక్రటరీ కాశీబాబు, డీఈ రామారావు, ఏఈలు శ్రీనివాసరావు, మోహిద్దీన్, ఏపీఓ వెంకట్రావు, సూర్యారావుపేట నాయకుడు సూరాడ రాజు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా పాల్గొన్నారు.


మ్యూజియం గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు. చిత్రంలో చైర్మన్ దీప్తి, వీసీ సుబ్బారావు

అందరికీ ఆరోగ్యం నినాదంతో వాక్‌థాన్

- ఐఎంఏ, ఆర్ఎంసీ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


ఎన్ఎస్ఎస్ బృందం వాక్‌థాన్

కాకినాడ క్రైం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కాకినాడ శాఖ, రంగరాయ వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో స్ఫూర్తిదాయక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) పిలుపునిచ్చిన 'అందరికీ ఆరోగ్యం' నినాదాన్ని పలుకుతూ వాక్‌థాన్ చేపట్టారు. కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మోకా పవన్‌కుమార్ ఈ వాక్‌థాన్‌ను ఆర్ఎంసీ ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమలతాదేవి, డాక్టర్ దేవి మాధవి మాట్లాడుతూ, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని తెలిపారు. ఆహారం, అలవాట్లే వ్యక్తి ఆరోగ్యాన్ని నిర్దేశించే అంశాలని పేర్కొన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ), ఆర్ఎంసీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ భాగస్వాములుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి చిట్ల కిరణ్, ఐడీఏ కాకినాడ పూర్వాధ్యక్షుడు డాక్టర్ అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ సూర్య నమస్కారాలు, యోగా,వ్యాయామం వంటి భారతీయ ప్రక్రియలు ఆరోగ్యాన్ని పెంపొందించడంలో ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అనంతరం జరిగిన వాక్‌థాన్ ఆర్ఎంసీ నుంచి భానుగుడి కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో నినాదాలు చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం 75 వసంతాల వేడుకను ప్రతిబింబిస్తూ ఆర్ఎంసీ ఎన్ఎస్ఎస్ బృందం భానుగుడి కూడలిలో చేపట్టిన 75 రూప ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్(ఏపీఎన్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామ్ స్వరూప్ జవహర్, రాష్ట్ర ఐఎంఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ వై.కళ్యాణ్ చక్రవర్తి తదితరులతో పాటు మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లింలకు 'వైఎస్'తో ఆత్మీయ బంధం

- ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యేలు కన్నబాబు, చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ముస్లిం మైనార్టీలతో వైఎస్ కుటుంబానికి ఎంతో ఆత్మీయ బంధం పెనవేసుకుని ఉందని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక ఈద్గా మైదానం ఆవరణలోని నూరాని మసీదులో శుక్రవారం రంజాన్ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ముస్లిం మైనార్టీలు అన్ని విధాలా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో రిజర్వేషన్లతోపాటు ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు, సీఎం జగన్ కూడా అదే బాటలో ముస్లిం మైనార్టీల సంక్షేమమే లక్ష్యంగా అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి కాకినాడలోని ముస్లిం మైనార్టీలు తమకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారన్నారు. వీరందించే సహకారం మరువలేనిదన్నారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వ స్థలాల్లో రెండు అత్యాధునిక వసతులతో మసీదులను కూడా నిర్మించుకున్నామని, త్వరలోనే పెండింగ్‌లో ఉన్న పనులను కూడా పూర్తి చేస్తామని ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్, కాకినాడ జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ కరీమ్, జాఫర్‌ఖాన్, ముస్లిం ప్రతినిధులు ఇక్బాల్ ఆలీ, ఆలీషా, లథీఫ్‌ఖాన్, పార్టీ మైనార్టీసెల్ అధ్యక్షుడు బాషా, నగర మైనారీ సెల్ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలీ పాల్గొన్నారు.

సర్వలోక రక్షకుడు ఏసు ప్రభువు

- మండలంలోని చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు
- సిలువతో ఊరేగింపులు



హౌస్‌ఆఫ్ ప్రేయర్‌లో జీసస్ సందేశం ఇస్తున్న పాస్టర్ విజయ్‌కుమార్


చర్చిస్క్వేర్ సెంటర్‌లో సిలువ మోస్తున్న జీసస్ వేషధారి

కరప: సర్వలోక రక్షణ కోసం, సమస్త మానవాళి పాపపరిహారానికి కల్వరి సిలువపై ప్రాణత్యాగం చేసిన మహోన్నతుడు ఏసుప్రభువు అని మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.డేవిడ్‌రాజు పేర్కొన్నారు. కరప చర్చిలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి, మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చిలలో గుడ్‌ఫ్రై వేడుకలను నిర్వహించారు. నడకుదురులోని బిలీవర్స్ చర్చిలో మండల పాస్టర్స్ యునైటెడ్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఫాదర్ మేడపాటి రాజ్‌కుమార్ ప్రత్యేక ప్రార్థనలు, వాక్యపఠనాలు చేసి, భక్తులకు దైవాశీర్వాదాలు అందించారు. యండమూరు గాస్పల్ బాప్టిస్ట్ చర్చిలో రెవ.ఐ.జాన్‌సూర్యప్రకాష్, కరపలో ఫెయిత్‌గాస్పెల్ చర్చిలో బిషప్ కె.అబ్రహంసామ్యూల్ ప్రత్యేక ప్రార్థనలు చేసి మానవాళి కోసం ఏసు ప్రభువు తన ప్రాణాన్ని ఎలా అర్పించారో వివరించారు. వేళంగిలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ నరేష్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులతో కలసి పవిత్ర శుక్రవారం క్రీస్తును శిలువ శిక్ష వేసి చంపిన సంఘటనలను ప్రదర్శిస్తూ సిలువతో ఊరేగారు. ఏసుప్రభువు మరణం పొందిన తర్వాత మృత్యువును జయించి మూడవ రోజు పునరుత్థానం పొందినట్టు ఆయన తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా యేసు భక్తులు ఉపవాసంతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలకు ఉపవాస దీక్ష విరమించారు. వివిధ గ్రామాల్లోని చర్చిల్లో మండల పాస్టర్స్ ఫెలోషిప్ కన్వీనర్ రెవ పి.సత్యప్రసాద్‌బాబు, సెక్రటరీ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, కె.ఆనంద్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఏసుబోధనలు వినిపించారు. టీడీపీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా పలు చర్చిలలో ప్రార్థనలు చేసి, 600 మందికి స్వీట్లు పంచారు.

కరప నీలయ్యతోటవీధిలోని బైబిలు బిషన్, పెనుయేలు మందిరంలో ఫాదర్ ఎం.దేవదాసు, పాస్టర్ తోటకూర యాకూబ్‌లు ప్రార్థనలు చేశారు. సిలువపై శిక్షవేసిన సంఘటనలు గుర్తుచేస్తూ గ్రామంలో ఊరేగారు. ఏసుప్రభువుగా పెనుపోతుల బూరయ్య, భటులుగా ఇస్సాకు, రాజేష్‌లు వేషధారణ అందరినీ ఆకట్టుకుంది.

పాపుల రక్షకుడు ఏసు

కాకినాడ కల్చరల్: మానవాళి పాపాలను కడగడం కోసం ఏసుక్రీస్తు తన రక్తాన్ని చిందించాడని బెరాకా బ్లెస్సింగ్ చర్చి పాస్టర్ జోషఫ్ బెన్ని అన్నారు. నగరంలో క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలతో గుడ్‌ఫ్రైడేను జరుపుకొన్నారు. చర్చిస్క్వేర్ సెంటర్లోని ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవ యువతీయువకులు గుడ్‌ఫ్రైడే విశిష్టతను తెలిపేవిధంగా ర్యాలీ నిర్వహించారు. జీసస్ వేషధారి శిలువ మోస్తున్న ఘట్టాలను, జీసస్‌ను శిలువ వేస్తున్న ఘట్టాలను ప్రదర్శించారు. ప్రదర్శన క్రైస్తవులను విశేషంగా ఆకట్టుకొంది. హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో పాస్టర్ విజయకుమార్ గుడ్‌ఫ్రైడే పురస్కరించుకొని జీసస్ సందేశం ఇచ్చారు. డైరీఫారం సెంటర్‌లోని హౌస్ ఆఫ్ హోలీ స్పిరిట్ చర్చిలో చిన్నారులు ప్రదర్శించిన సిలువపై ఏసు లఘు నాటిక ఆకట్టుకొంది. పాస్టర్ అబ్రహం పాల్ యాంగిచో జీసస్ సందేశం ఇచ్చారు. యువతీయువకులు ఆలపించిన క్రైస్తవ గీతాలు అలరించాయి. సెయింట్ ఆన్స్ చర్చి, ఆంధ్రా బాప్టిస్టు చర్చి, జాన్‌క్రెగ్ చర్చి, రామారావుపేటలోని క్రెగ్ ఇమ్మానియేల్ బాపిస్టు చర్చి, సెయింట్ లూథరన్ చర్చి, సిటీ టాబర్నికల చర్చి, సిటీ చర్చిలో పాస్టర్స్ జీసస్ సందేశం ఇచ్చారు. క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వేములవాడ ఏటిగట్టు రోడ్డు బంద్

- కాంట్రాక్టర్ లీజు చెల్లించనందుకు నిరసనగా మూసివేసిన రైతులు


అప్రోచ్ రోడ్డును ఇనుపమెస్, ముళ్లకంచెతో బంద్ చేసిన దృశ్యం

కరప: మండల పరిధిలోని ఏటిగట్టురోడ్డు వెంబడి రాకపోకలు సాగించకుండా రైతులు మూసివేశారు. వంతెన కాంట్రాక్టర్ నాలుగేళ్లుగా లీజు చెల్లించకపోవడం వల్లే రహదారిని బంద్ చేసినట్టు రైతులు అంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. వేములవాడ నుంచి తుల్యభాగ డ్రెయిన్ వెంబడి ఉండే ఏటిగట్టురోడ్డు గొర్రిపూడి మీదుగా తాళ్లరేవు మండలాన్ని అనుసంధానం చేస్తుంది. ఈ రహదారి గుండా మండల వాసులు తాళ్లరేవులోని రిజిస్ట్రార్ కార్యాలయానికి, కాజులూరు మండలం వెళ్లేందుకు, ద్రాక్షారామ, కోటిపల్లి పుణ్యక్షేత్రాలకు వేములవాడ ఏటిగట్టురోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారిలో కొంగోడు వద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై వంతెన నిర్మించేందుకు టీడీపీ హయాంలో ఎన్‌టీఆర్ వారధి పేరిట రూ.5.19 కోట్లు మంజూరు చేయగా, 2017 డిసెంబర్ 30న అప్పటి మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి భూమిపూజ చేశారు. వంతెన నిర్మాణానికి అనువుగా అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు డ్రెయిన్ పక్క రైతులు మేడిశెట్టి రాధాకృష్ణ నుంచి రెండున్నర ఎకరాలు, దంగేటి చంటి, మరొక రైతు నుంచి ఎకరన్నర పంటపొలాలను లీజుకు తీసుకుని, ఎకరాకు రూ.లక్ష వంతున ఏడాదికి లీజు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే కాంట్రాక్టర్ వంతెన నిర్మాణం పనులు నాలుగేళ్లుగా నిలిపేయడమే కాకుండా, రైతులకు ఇవ్వాల్సిన లీజు కూడా చెల్లించలేదు. దీంతో తమ భూములు లీజుకిచ్చిన రైతులు నెలక్రితం కాంట్రాక్టర్ నాలుగేళ్లుగా లీజు చెల్లించనందున ఏప్రిల్ నెల నుంచి దారి ఆపివేస్తున్నామని రైతులు, ప్రజలు సహకరించాలని గమనిక బోర్డును ఉంచారు. అయినా కాంట్రాక్టర్ నుంచి ఎటువంటి సమాధానం రాకపోయే సరికి వేములవాడ ఏటిగట్టు రోడ్డులో వంతెన వద్ద వేసిన అప్రోచ్ రోడ్డుకు అడ్డుగా కర్రలుపాతి ఇనుప మెస్, ముళ్లకంచెలతో మూడుచోట్ల మూసివేశారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఏటిగట్టు రోడ్డుపై ప్రయాణికులు రాకపోకలు బంద్ అవ్వడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి రైతులకివాల్సిన లీజు సొమ్ములు చెల్లించేలా చర్యలు తీసుకుని, రహదారిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.